ఈనాడు
విజయనగరం
శనివారం సెప్టెంబరు 28, 2024

ఉద్యోగ కల్పన.. పరిశ్రమల స్థాపన

'ఈనాడు' ముఖాముఖిలో కలెక్టర్ అంబేడ్కర్

ఈనాడు, విజయనగరం: జిల్లాలో ప్రకృతి వనరులు, సహజ సంపదకు కొదవలేదు. వాటిని సద్వినియోగం చేసుకుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆ దిశగా ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వ ఆమోదం కోసం చూస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. విధుల్లో చేరి ఈ నెల 25కు మూడు నెలలు పూర్తయిన సందర్భంగా 'ఈనాడు'తో మాట్లాడారు.



ముఖాముఖి

మేళాలతో ఉపాధి

జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. అన్ని నియోజకవర్గాల్లో మెగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తాం. ఇప్పటికే నెల్లిమర్ల నియోజకవర్గంలో జరిగింది. హాజరైన అయిదు వేల మంది యువతలో 2500 మందికి పైగా వివిధ కంపెనీల్లో కొలువులు కల్పించాం. నైపుణ్య శిక్షణ కేంద్రాలు తొమ్మిది ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో స్వల్ప కాలపరిమితితో శిక్షణ ఇస్తున్నారు. ఈ కాలాన్ని మరికొంత కాలం పొడిగించి వారిని సానబెడితే మెరికల్లా తయారవుతారు.

పర్యాటక సొబగులు

జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ముఖ్యమైన ప్రదేశాలు గుర్తించాం. విజయనగరంలో పెద్ద చెరువును పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం కింద అభివృద్ధి చేస్తాం. తాటిపూడి జలాశయాన్ని మరింతగా తీర్చిదిద్దుతాం. దీని ప్రగతికి సంబంధించి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించాం. జలాశయంలో విహార యాత్ర, అక్కడ పక్షులు, సీతాకోక చిలుకల పార్కుతో ప్రశాంత వాతావరణంలో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసేలా చేస్తాం.

నియోజకవర్గాల్లో పార్కులు

ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తాం. గజపతినగరం మండలంలో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేసి, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ యోచిస్తున్నారు. వీటికి సంబంధించి చాలా ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రభుత్వ ఆమోదంతో వాటి అమలుకు ప్రయత్నిస్తాం. త్వరలో ఎస్.కోటలో ప్రైవేటు రంగంలో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనకు సంబంధిత యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది.

పారాది వంతెన పూర్తి చేస్తాం


బొబ్బిలి-పార్వతీపురం మధ్య పురాతన పారాది వంతెన బలహీనపడటంతో ఉభయ జిల్లాల ప్రజలే కాకుండా ఒడిశావాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పలుమార్లు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై చర్చించాం. శాశ్వత వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో పనులు చేపట్టాలని గుత్తేదారును కోరగా ప్రారంభించారు. దీనిని వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తా.

66 ఇళ్లకు ఆర్థిక సాయం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 66 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. గతంలో ఒక్కో ఇంటికి రూ.4 వేలు చెల్లించేవారు. ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. 52 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. ఆ వివరాలు సచివాలయాల్లో ఉంచాం. వారికి పెట్టుబడి రాయితీ అందిస్తాం. రోడ్లు బాగా ధ్వంసమయ్యాయి. వాటి అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నాం.

ఉత్సవాలు విజయవంతం చేస్తాం

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి సిరిమానోత్సవం విజయవంతం చేస్తాం. ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఈసారి వినూత్నంగా ఏర్పాట్లు ఉంటాయి. సిరిమాను ఆలస్యం కాకుండా ప్రత్యేకంగా వివిధ విభాగాలకు బాధ్యతలు అప్పగించాం. రథం వద్దకు భక్తులు సామూహికంగా రాకుండా రోప్ పార్టీలు ఏర్పాటు చేస్తాం. దీనిపై ఎస్పీ వకుల్ జిందాల్ రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. భక్తులకు ఉచితంగా దర్శనం కల్పిస్తాం.



పెరిగిన తాటిపూడి నీటిమట్టం

తాటిపూడి (గంట్యాడ), న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు తాటిపూడి జలాశయంలో 295.40 అడుగులకు నీటిమట్టం చేరిందని ఏఈ వి.తమ్మునాయుడు తెలిపారు. గరిష్ఠ నీటిమట్టం 297 అడుగులు కాగా, ప్రస్తుతం 295.40 మేర ఉందన్నారు. ఇంకా వరద వచ్చి చేరితే.. అధికారుల అనుమతితో లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి నీటిని కిందకు విడుదల చేస్తామని చెప్పారు.

గృహం.. నవ సంకల్పం

గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు పడకేశాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో నిలిచిపోయిన ఇళ్లను వేగవంతం చేయాలని కూటమి సర్కారు ఆదేశించింది. ఇందుకు వంద రోజుల ప్రగతి లక్ష్యాలను నిర్దేశించడంతో ఆ దిశగా అధికార యంత్రాంగం పరుగులు తీస్తోంది. శ్లాబు స్థాయిలో ఉన్నవి, దాటినవి ముందుగా పూర్తి చేయించాలని ప్రయత్నిస్తున్నారు. వివిధ దశల్లో ఉన్న వాటి వేగవంతానికి లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నారు.


ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే-విజయనగరం అర్బన్, రాజాం



అప్పులు చేయలేమంటూ..

గత ప్రభుత్వ హయాంలో ఉభయ జిల్లాల్లో 1,16,447 మందికి గృహాలు మంజూరు చేశారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఒక్కో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.నాలుగైదు లక్షలు ఖర్చవుతుందని, తమ వల్ల కాదని 16,947 మంది పనులే ప్రారంభించలేదు. డ్వాక్రా సంఘాల నుంచి ఒక్కో లబ్ధిదారుకు అదనంగా రూ.30 వేలు రుణం ఇప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినా స్పందించలేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి గూడు కల్పించాలన్న ఉద్దేశంతో ఆర్థిక సాయం అందిస్తోంది. గత ప్రభుత్వం 'జగనన్న కాలనీలు' పేరు పెట్టుకుని హడావుడి చేసింది. కేంద్ర సాయంతో జిల్లాల వారీగా భారీగా ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటించకుండా అనర్హులకు కేటాయించారు. అప్పటి ప్రజాప్రతినిధులు అనువు గాని చోట లేఅవుట్లకు స్థలాలు గుర్తించి కొనుగోలు చేశారు. అందులో ఒక్కో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ సాయం రూ.1.80 లక్షలు ఇస్తామని చెప్పినా.. అనువుగా లేవని చాలా మంది లబ్ధిదారులు ముందుకు రాలేదు.



బొబ్బిలి పట్టణంలోని రామన్నదొరవలస జగనన్న కాలనీ

ఇప్పుడు ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. వంద రోజుల ప్రణాళిక అమలులో విజయనగరం జిల్లాలో 3,654 ఇళ్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 25 నాటికి 1,913 అయ్యాయి. ప్రభుత్వ లక్ష్యంలో 52 శాతమే పూర్తి చేయగలిగారు. మన్యం జిల్లాలో 2,128 ఇళ్లు పూర్తి చేయాలని నిర్ణయించినా 50 శాతం కాలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడం, వానలు కురుస్తుండటంతో లబ్ధిదారులు వేగవంతం చేయలేకపోయారు. క్షేత్రస్థాయిలో అధికారుల కొరత ఉంది. మండలాల్లో ఇంజినీరింగ్ అధికారులు లేకపోవడంతో ఒప్పంద ప్రాతిపదికన వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న వారికి ఏఈలుగా బాధ్యతలు అప్పగించారు.

అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం

లబ్ధిదారులను కలిసి మాట్లాడుతున్నాం. వారిని అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాం. ఫిబ్రవరి నాటికి కచ్చితంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో కింది స్థాయి ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాం. మండలానికి ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించాం. శనివారం నుంచి లేఅవుట్లలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– ఎ.శ్రీనివాస్, జి.కేశవనాయుడు, గృహ నిర్మాణ సంస్థ పీడీలు (ఇన్‌ఛార్జి)

ఉభయ జిల్లాలో ప్రగతి ఇలా..

జిల్లా	మంజూరు	పూర్తి	ప్రారంభించనవి	వివిధ స్థాయిల్లో ఉన్నవి	చివరి దశలో ఉన్నవి
మన్యం	34,448	14,821	5,756	11,664	2,128
విజయనగరం	81,999	43,328	11,191	27,480	2,770



అదితి గజపతిరాజును సన్మానిస్తున్న ఉప కులపతి కట్టీమని

పర్యాటక కేంద్రంగా విజయనగరం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దేశంలోనే గుర్తింపు పొందిన పర్యాటక కేంద్రంగా విజయనగరాన్ని అభివృద్ధి చేయవచ్చని, ఆ దిశగా ముందుకెళ్తామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(సీటీయూ), మాన్సాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా పైడితల్లి ఆలయం నుంచి కోట కూడలి వరకు వివిధ దేశాల వస్త్రధారణలతో విద్యార్థులు కల్చరల్ వాక్(ర్యాలీ) నిర్వహించారు. అనంతరం కోటలో కోలాటం, థింసా నృత్యాలతో సభ ప్రారంభమైంది. అదితి గజపతిరాజు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన నగరంలో చారిత్రక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు, ఎళ్లనాటి కోటలు ఉన్నాయని గుర్తు చేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను సత్కరించారు. విద్యాలయం ఉపకులపతి టి.వి.కట్టీమని, మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.వి.లక్ష్మీపతిరాజు, సీటీయూ డీన్ జితేంద్ర మోహన మిశ్రా, రిజిస్ట్రార్ శ్రీనివాస్, మహారాజా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రధానాచార్యుడు డా.బి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే భారీ జరిమానా

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన పలువురికి శుక్రవారం స్టేషన్ ప్రాంగణంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల 23 మందిపై కేసులు నమోదు చేసి వారిని న్యాయస్థానంలో హాజరుపర్చగా వారందరికీ రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని చెప్పారు. ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని పేర్కొన్నారు.

ప్రకటించి 9 నెలలు.. పనులకు ఇంకెన్నాళ్లు

ముందుకు కదలని చీపురుపల్లి ఆసుపత్రి ఉన్నతీకరణ

గత ప్రభుత్వం అయిదేళ్లూ అభివృద్ధి చేస్తున్నట్లు గొప్పలు చెప్పడానికే సరిపోయింది. చీపురుపల్లి ఆసుపత్రిని వంద పడకల ప్రాంతీయాసుపత్రిగా ఉన్నతీకరిస్తూ.. గత ప్రభుత్వం 2023 డిసెంబరు 27న ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు భవనాల నిర్మాణానికి రూ.28.38 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. ఆ తరువాత అధికారులు దీన్ని పట్టించుకోలేదు. నిధులు మంజూరు కాగితాలకే పరిమితమైంది. 9 నెలలు గడుస్తున్నా నిర్మాణాలకు మోక్షం లభించలేదు. నేటికీ అవసరమైన సిబ్బంది నియామకం లేదు. అత్యవసర పరిస్థితిలో రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు, జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రస్తుతం 30 పడకలు మాత్రమే ఉన్నాయి.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి



ఓపీ విభాగం వద్ద రోగులు

ఎముకల విభాగానికి వైద్యులైతే ఉన్నారు. కానీ భవనం లేక పరికరాలు ఏర్పాటు చేయలేదు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. జనరల్ సర్జరీకి సంబంధించి పూర్తిస్థాయి థియేటర్ ఏర్పాటు కాకపోవడంతో వైద్యుడు ఉన్నా.. అన్ని రకాల శస్త్రచికిత్సలు జరగడం లేదు. ప్రాంతీయాసుపత్రికి అనుగుణంగా సెక్యూరిటీ, పారిశుద్ధ్య విభాగాలను విస్తరించాల్సి ఉంది. నవజాత శిశు సంరక్షణ విభాగానికి కేవలం ఒక వైద్యుడు మాత్రమే ఉన్నారు. ఆసుపత్రిలో జనరల్ సర్జన్, పిల్లలు, చర్మ వ్యాధుల వైద్యులు.. రేడియాలజీ, ఎన్‌సీడీ, జనరల్ వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాలుగు హెడ్ నర్సు పోస్టులకు కేవలం ఒకరు మాత్రమే ఉన్నారు. జనరల్ డ్యూటీ అటెండర్ పోస్టులు 5, ఓటీ సహాయకులు 3 ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రి ఉన్నతీకరణ సమయంలో మంజూరు చేసిన ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది భర్తీ నేటికీ జరగలేదు.

ఆసుపత్రికి నెలకు వచ్చే ఓపీ:	8,862 (ఆగస్టులో)
ఐపీ రోగులు:	596 (ఆగస్టులో)
పనిచేస్తున్న వైద్యులు:	19 మంది
ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు:	5
భర్తీ కావాల్సిన స్టాఫ్ నర్సు పోస్టులు:	11
భర్తీ చేయాల్సిన హెడ్ నర్సు పోస్టులు:	3



నిరుపయోగంగా పరుపులు, మంచాలు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

వంద పడకల ఆసుపత్రి భవనాల నిర్మాణ అంశాన్ని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దృష్టికి తీసుకెళ్లాం. సమస్యలన్నీ వివరించాం. ఈ విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను ప్రభుత్వం త్వరలో భర్తీ చేసే అవకాశం ఉంది. – నాయక్, వైద్యాధికారి

బాక్సింగ్‌లో మెరుపులు శిక్షకుడిగా బాధ్యతలు

ఆరో తరగతి చదువుతున్నప్పుడే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకొని నిరంతర సాధనతో క్రీడాకారుడిగా రాణించాడు.. తగిన గుర్తింపు పొంది.. జిల్లాకు పేరు తీసుకొచ్చాడు.. నేడు తనలాంటి వందలాది మందిని తీర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నగరానికి చెందిన బి.ఈశ్వరరావు.

– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

కంటోన్మెంటు ప్రాంతానికి చెందిన బి.సోములు, సూరమ్మ దంపతుల కుమారుడు బి.ఈశ్వరరావు. తండ్రి పురపాలక సంఘంలో చిరుద్యోగి. తల్లి గృహిణి. బాక్సింగ్ అంటే తమ కుమారుడికి ఎంతో ఇష్టమని గ్రహించి ప్రోత్సహించారు. 1992లో పి.రామకృష్ణ, డి.మారయ్య వద్ద ఓనమాలు నేర్చుకున్న ఈశ్వరరావు ఆ తరువాత ఇండియన్ బాక్సింగ్ ముఖ్య శిక్షకుడు ఇ.చిరంజీవి వద్ద చేరి, తిరుగులేని క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. రాష్ట్రస్థాయిలో 30కు పైగా టోర్నీలు, నేషనల్స్‌లో రెండు, ఆలిండియా మీట్‌లు రెండింట్లో పాల్గొని పతకాలు కొల్లగొట్టాడు. ప్రస్తుతం శాప్ కోచ్‌గా ఉమ్మడి జిల్లాలో సేవలందిస్తున్నారు.

65 మందికి కొలువులు

క్రీడాకారుడిగా రాణించిన తరువాత శిక్షకుడిగా స్థిరపడ్డారు. ఇప్పటికే 200 మంది బాక్సర్లను తీర్చిదిద్దారు. ఇందులో సుమారు 65 మంది వరకు ఆర్మీ, నేవీ, పోలీస్, ఆర్పీఎఫ్ విభాగాల్లో కొలువులు సాధించారు. ప్రస్తుతం మరికొంతమంది సాధన చేస్తున్నారు. ఈ ఏడాది యూత్ ఏషియన్ టైటిల్ కోసం పోరాడిన జె.వసంతరావు ఇతని శిష్యుడే. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వసంతరావు గతేడాది అండర్-19 నేషనల్ మీట్‌లో కాంస్యం గెల్చుకున్నాడు. జి.అచ్యుతరావు యూత్ ప్రపంచ కప్ పోటీల్లో రాణించాడు. డి.దేవస్వరూప్ ఈ ఏడాది అండర్-14లో కాంస్యం దక్కించుకున్నాడు. బి.సచిన్, పి.దుర్గాప్రసాద్ సైతం ఇక్కడి వారే.



క్రీడాకారులతో సాధన చేయిస్తున్న ఈశ్వరరావు

విజయనగరం వేదికగా..

కొన్నిరోజులుగా శిక్షణ ఇస్తున్నా. విజయనగరం వేదికగా రాష్ట్రస్థాయి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాం. నిరుపేద పిల్లలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్నవారిని ప్రోత్సహిస్తున్నాం.

– బి.ఈశ్వరరావు, శాప్ కోచ్, విజయనగరం

రాజాం రహదారులకు మోక్షం

'ఈనాడు' కథనానికి స్పందన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

న్యూస్‌టుడే- రాజాం: రాజాం పట్టణంలోని రహదారుల విస్తరణ పనులు మళ్లీ మొదలయ్యాయి. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం పాలకొండ రహదారిలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో భూమిపూజ చేసి పునః ప్రారంభించారు. వాహన చోదకులు, ప్రజలు పడుతున్న అవస్థలపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. బకాయి రూ.6 కోట్లు చెల్లించినా గుత్తేదారు పనులు చేపట్టడంలో తాత్సారం చేస్తూ వచ్చారు. తరచూ భారీ వాహనాలు గోతుల్లో దిగి చక్రాలు కూరుకుపోతున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటన్నంటినీ 'ఈనాడు' కళ్లకు కట్టినట్లు ప్రచురించడంతో ఎమ్మెల్యే స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని గుత్తేదారుకు సూచించారు.

పాలకొండ కూడలి నుంచి జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకు, బొబ్బిలి కూడలి నుంచి గాయత్రీ కాలనీ వరకూ 80 అడుగుల వెడల్పున రహదారిని విస్తరించాలి. ఇరువైపులా వరద కాలువల నిర్మాణంతో పాటు రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలి. ఇందుకు రూ.20 కోట్లు కేటాయించారు. రూ.6 కోట్ల విలువైన పనులు చేసినా వైకాపా ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా మొండికేయడంతో గుత్తేదారు నిలిపేశారు. ఈ బకాయిలను చంద్రబాబు ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. ఎమ్మెల్యే చొరవతో మళ్లీ పనులు ప్రారంభం కావడంతో జనంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఈనాడులో ప్రచురితమైన కథనాల్లో కొన్ని

కుంకీలొస్తున్నాయ్

కొమరాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో అయిదేళ్ల నుంచి ఏనుగుల సంచారం ఎక్కువైంది. పలువురు ప్రాణాలు కోల్పోగా, చాలా మంది రైతులు పంటలను నష్టపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం జరిగిన చర్చల్లో రాష్ట్రానికి 4 ఏనుగులు పంపించేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. మన్యం జిల్లాకు రెండు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి అయిదుగురు ట్రాకర్లను కర్ణాటక పంపించి శిక్షణ ఇస్తారు. తర్వాత పెంపుడు ఏనుగులతో తిరిగి వస్తారు.

నేడు మహా శాంతి హోమం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వాడిన నేపథ్యంలో ప్రాయశ్చిత్తంగా శనివారం ఉదయం 8.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత స్వామివారికి రామతీర్థం దేవస్థాన కల్యాణ మండపం ప్రాంగణంలో మహా శాంతిహోమం నిర్వహిస్తామని శ్రీరామతీర్థం సేవా సంఘం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హాజరుకానున్నట్లు చెప్పారు.

2.78 లక్షల మందికి పింఛన్లు

★ నిధుల మంజూరు



న్యూస్‌టుడే- రాజాం

జిల్లా	సంఖ్య	నిధులు
విజయనగరం	2,78,240	రూ.115.86 కోట్లు
పార్వతీపురం మన్యం	1,42,393	రూ.59.18 కోట్లు

కూటమి సర్కారు ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4 వేలు ఇస్తున్నారు. అక్టోబరులో పంపిణీకి ఈ నెల 30నే బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించి సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి తొలిరోజే 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల చేతికి నగదు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఒకవేళ 1న సెలవు దినమైతే ముందు రోజే పంపిణీ చేయాలని ఉత్తర్వులొచ్చాయని విజయనగరం పీడీ కల్యాణ చక్రవర్తి తెలిపారు.

నియోజకవర్గం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
బొబ్బిలి	42,939	17.91
నెల్లిమర్ల	38,955	16.35
ఎస్ కోట	41,630	17.29
చీపురుపల్లి	38,233	16.00
రాజాం	39,192	16.05
పాలకొండ	36,006	24.30
కురుపాం	39,761	26.60
గజపతినగరం	40,640	16.76
విజయనగరం	29,068	12.39
పార్వతీపురం	38,949	24.28
సాలూరు	29,802	20.23



(c) eenadu

ఆలోచనొచ్చింది.. ఆవిష్కరణ మెరిసింది

వాహనాల తయారీలో యువకుడి ప్రతిభ

ఆ కుర్రాడి దృష్టి పడితే.. పాత వాహనాలు రయ్‌మంటూ పరుగులు తీస్తాయి.. సాంకేతిక పరిజ్ఞానానికి సృజన తోడై.. పర్యావరణానికి హాని చేకూర్చని విద్యుత్తు, సౌరశక్తితో నడిచే వాహనాలు దర్శనమిస్తాయి.. తక్కువ ఖర్చుతో వివిధ వాహనాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు బొబ్బిలి మండలంలోని మెట్టవలసకు చెందిన ఉంగట్ల శంకరరావు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



ఇలా అడుగులు..


కలుపుతీత యంత్రం

బొబ్బిలి ఐటీఐలో శంకరరావు ఎలక్ట్రికల్ కోర్సు చేసి దూరవిద్య ద్వారా డిగ్రీ చదివాడు. తొలుత కూలీలు సమయానికి దొరక్కపోవడం, కూలి రేట్లు పెరిగిపోవడం తదితర సమస్యల్ని గుర్తించి సౌరశక్తితో పని చేసే కలుపుతీసే యంత్రాన్ని తయారు చేశాడు. పాత సైకిల్‌ను సేకరించాడు. నాలుగు చక్రాలు అమర్చాడు. దానికి సౌర పలక ఏర్పాటు చేశాడు. యంత్రం నడపడానికి హ్యాండిల్ కూడా ఇనుప రాడ్లతో తయారు చేశాడు. 24 వాట్ల మోటారు అమర్చాడు. సూర్యరశ్మి లేనప్పుడు ఛార్జింగ్ చేసుకోవడానికి పరికరాలు బిగించాడు. రెండు గంటల పాటు ఛార్జింగ్ చేస్తే దాదాపు 5 గంటలపాటు పనిచేసేలా రూపొందించాడు. అయిదు రోజులపాటు కష్టపడి రూ.2 వేలతో తయారు చేశానని, దీనివల్ల ఎకరానికి రూ.3 వేల వరకు ఆదా అవుతుందని చెబుతున్నాడు.


విద్యుత్తు వాహనం

విద్యుత్తు వాహనం..

వాయు కాలుష్యాన్ని నివారించడానికి విద్యుత్తుతో పనిచేసే చిన్న ద్విచక్ర వాహనాన్ని రూపొందించాడు. పాత ఎక్సెల్ వాహనం, ఇతర సామగ్రితో 24 వాట్ల సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఏర్పాటు చేశాడు. 35 వాట్ల సామర్థ్యం కలిగిన మోటారు అమర్చాడు. రెండు గంటల పాటు ఛార్జింగు పెడితే 25 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చని చెబుతున్నాడు. రూ.5 వేలు ఖర్చు చేసి, వారం రోజుల పాటు కష్టపడి తయారు చేశానని పేర్కొన్నాడు.

బ్యాటరీ సైకిల్

బ్యాటరీతో నడిచే వినూత్న సైకిల్‌ను తయారు చేశాడు. దీనికోసం రూ.5 వేలు వెచ్చించి 15 రోజులు కష్టపడినట్లు చెప్పాడు. 24 వాట్ల బ్యాటరీ, అంతే సామర్థ్యం ఉన్న మోటారు అమర్చాడు. సైకిల్‌ను నియంత్రించడానికి 30 హార్స్ పవర్ కలిగిన యంత్రాన్ని ఏర్పాటు చేశాడు. నాలుగు గంటలపాటు ఛార్జింగు పెడితే 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చని, గంటకు 35 కి.మీ వేగంతో నడుస్తుందని పేర్కొంటున్నాడు శంకరరావు.


సరికొత్త కారు

డీజిల్, పెట్రోల్ అవసరం లేకుండా కేవలం బ్యాటరీతో నడిచే కారును రూపొందించాడు. నెల రోజులు కష్టపడి సుమారు రూ.50 వేలు వెచ్చించి, దీన్ని తయారు చేశాడు. సమీపంలోని గ్యారేజీ నుంచి పాత చక్రాలు, టైర్లు, ఇంజిన్ సేకరించాడు. పాత జింక్ రేకులతో కారు పైకప్పు ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వెల్డర్ సాయం తీసుకున్నాడు. 48 వాట్ల సామర్థ్యం ఉన్న నాలుగు బ్యాటరీలను అమర్చాడు. ముందుకు, వెనక్కి వెళ్లడానికి వీలుగా గేరు మోటారు బిగించాడు. కారులో నలుగురు కూర్చోవడానికి వీలుగా రెండు వరుసల్లో సీట్లు ఏర్పాటు చేశాడు. గంటపాటు ఛార్జింగు చేస్తే 30 కి.మీ దూరం వెళ్తుందని శంకరరావు అంటున్నాడు. దీనినే ప్రస్తుతం బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, సాలూరుకు వెళ్లడానికి ఉపయోగిస్తున్నానన్నారు. గతంలో పిచికారీ చేసే యంత్రం, బావి నుంచి పొలాలకు నీరు తోడే యంత్రం కూడా తయారు చేశాడు.



తయారు చేసిన కారు

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం


మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న లెండి కళాశాల యాజమాన్య ప్రతినిధులు

డెంకాడ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం డెంకాడ మండలం జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.5 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించింది. సంబంధిత చెక్కును కళాశాల ఛైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ విశాఖపట్నంలోని తెదేపా కార్యాలయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు గురువారం రాత్రి అందజేశారు. యాజమాన్య ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి విజయకల్యాణి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని పందిరప్పన్న కూడలి సమీపంలో ఉన్న ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఇక్కడి సదుపాయాలపై సంక్షేమాధికారిణి విజయనిర్మల, సిబ్బందిని ఆరా తీశారు. ఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. తీసుకున్న చర్యలపై తహసీల్దారు అరుణకుమారిని ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తి స్థానిక సబ్‌జైలును సందర్శించారు.

నెలలుగా జీతాల్లేవ్!!


కలెక్టరేట్‌కు వచ్చిన జీడీఏ ఉద్యోగులు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజ, ఘోష ఆసుపత్రులు, వైద్య కళాశాలలో పనిచేస్తున్న 48 మంది కింది స్థాయి ఉద్యోగులకు 14 నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. దీంతో కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, ఘోషాసుపత్రులను వైద్య కళాశాలలో కలిపారు. అందులో భాగంగా పొరుగు సేవల విభాగంలో క్లాస్- 4(జీడీఏ, ఆఫీస్ సబార్డినేటర్, స్టోర్ అటెండెంటు తదితర) ఉద్యోగులను నియమించారు. మొదటి విడతలో 150 మందిని తీసుకున్నారు. వీరికి ఎనిమిది నెలల తరువాత ఆప్కాస్ ద్వారా జీతాలు పడ్డాయి. రెండో విడతలో నియమితులైన 48 మందికి ఇంకా వేతనాలివ్వలేదు.

నగదు డిమాండు

గత ప్రభుత్వ హయాంలో ఓ మాజీ ప్రజాప్రతినిధి జీతాలు రాకుండా అడ్డుపడ్డారనే ఆరోపణలున్నాయి. దీంతో కొందరు నేరుగానే విమర్శలు చేశారు. ఏమీ ముట్టజెప్పకుండానే ఉద్యోగాలు కొట్టేశారని, రూ.50 వేల చొప్పున ఇస్తే జీతాలొచ్చేలా చేస్తానని సదరు వ్యక్తి తమను డిమాండు చేశారని పలువురు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు కలగజేసుకుని ఎన్నికల తరువాత ఇస్తామని చెప్పడంతో సద్దుమణిగారు. కానీ నేటికీ అందలేదు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

కొత్త ప్రభుత్వం వచ్చాక సిబ్బంది కలెక్టర్ అంబేడ్కర్‌ను, ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కలిసి వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వం ఆర్థిక శాఖ నుంచి అనుమతులు తీసుకోకుండా నియమించేసిందని, ఆప్కాస్ వెబ్‌సైట్ సైతం మూతపడడంతో బిల్లులు పెట్టే పరిస్థితి లేదని వారు స్పష్టం చేశారు. ఈక్రమంలో చిరుద్యోగులు కావడంతో నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు నెలలకు సంబంధించి అందజేశారని, తరువాత ఆపేశారని మళ్లీ నిరసనకు దిగుతున్నారు.

వారివీ అవే కష్టాలు..

వైకాపా హయాంలో ప్రారంభమైన మత్తు వ్యసనపరుల విముక్తి కేంద్రంలో పనిచేసిన ఉద్యోగులదీ ఇదే పరిస్థితి. ఈ విభాగంలో ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, కౌన్సిలర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇలా 8 నుంచి 10 మందిని నియమించారు. వీరి కోసం ప్రత్యేకంగా ఓపీ, ఐపీ గదులు, చికిత్స కోసం పడకలు, యోగా గది, కౌన్సెలింగ్ కేంద్రాలను సమకూర్చారు. అయితే జీతం సక్రమంగా రావడం లేదని, 8 నెలల బకాయి ఉందని వైద్యాధికారి గతంలోనే బయటకు వెళ్లిపోగా, ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులు సైతం మానేశారు. మిగిలిన వారికి నేటికీ ఎదురుచూపులు తప్పడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి..

ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో పనిచేస్తున్న వారి జీతాల కోసం ఇటీవల చర్చకు వచ్చింది. సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారికి నగదు ఇచ్చేందుకు ప్రత్యేకంగా బడ్జెట్ లేదు. అక్కడి నుంచి అనుమతులు వస్తే అందజేస్తాం.

– ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంటు, మహారాజా ఆసుపత్రి

ఆరోగ్యంగా ఉంటేనే విధుల నిర్వహణ సాధ్యం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నిరంతరం ప్రజా సేవలో ఉండే పోలీసులు ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే విధి నిర్వహణలో పక్కాగా పనిచేయగలరని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా నగరంలోని పోలీసు కార్యాలయంలో తిరుమల- మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై దృష్టిసారించాలని కోరారు. అవసరమైన వారికి నిపుణులతో కూడిన వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ● అంతకుముందు 'పోలీసు వెల్ఫేర్ డే'ను నిర్వహించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు.

వేలిముద్ర వేయించి.. డబ్బులు కాజేసి

మక్కువ, న్యూస్‌టుడే: నిరక్షరాస్యతను ఆసరాగా తీసుకుని ఓ వృద్ధురాలి వేలిముద్రతో నగదు కాజేశాడు ఓ బ్యాంకుమిత్ర. ఈ ఉదంతం మక్కువ మండలం లింగాడవలసలో శుక్రవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన వృద్ధురాలు బి.కాంతమ్మ ఖాతాలో గతంలో ఇంటి బిల్లు జమైంది. ఆ సొమ్ము వచ్చినట్లు ఆమెకు తెలియదు. వెంకట భైరిపురంలో బ్యాంకుమిత్రగా సేవలందిస్తున్న ఓ వ్యక్తి ఆమె వద్దకు వచ్చి గృహనిర్మాణ సంస్థ అధికారిగా చెప్పి బయోమెట్రిక్ వేయించి ఆగస్టు 17న రూ.30 వేలు తీసేశాడు. దీని గురించి ఎవరూ అడగకపోవడంతో ఈనెల 9న మరో రూ.30 వేలు డ్రా చేశాడు. 17న మళ్లీ వేలిముద్ర వేయించడానికి రాగా.. కొంత మంది ప్రశ్నించడంతో పరారయ్యాడు. బాధితులకు అనుమానం వచ్చి మరో బ్యాంకుమిత్ర వద్ద ఖాతా వివరాలు ఆరా తీసి.. అప్పటికే రూ.60 వేలు దోచేసినట్లు గ్రహించారు. అదే కుటుంబంలోని డి.సుజాత ఖాతాలో నాలుగేళ్ల కిందట రూ.10 వేల చొప్పున మరో వ్యక్తి రూ.30 వేలు దోచేశాడు. ఈ విషయంపై నిందితుడిని బాధితులు ప్రశ్నించగా.. కాంతమ్మ ఖాతాలో ఈనెల 19న రూ.60 వేలు వేశాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎస్‌బీఐ మేనేజర్ శాంతికళ చెప్పారు.

బంగారం చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: బంగారం చోరీ కేసులో నిందితురాలిని ఒక్క రోజులోనే విశాఖ రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 46 గ్రాముల ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారి వివరాల ప్రకారం.. కొత్తవలస మండలం మంగళంపాలెం సమీపంలోని ఆళ్లవారివీధికి చెందిన ఎ.లత ఈనెల 26న తోడికోడళ్లతో కలిసి బంగారం కొనేందుకు విశాఖ సంపత్ వినాయగర్ సమీపంలోని ఓ దుకాణానికి వెళ్లారు. అక్కడ 46 గ్రా. ఆభరణం కొన్నారు. తర్వాత ఆటో ఎక్కి కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. అక్కడ కొత్తవలస వెళ్లే బస్సు ఎక్కారు. ఈక్రమంలో తన బ్యాగును తనిఖీ చేసుకోగా ఆభరణం కనిపించలేదు. దీంతో రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈస్ట్ క్రైమ్ సీఐ రాజులనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై సునీల్ దర్యాప్తు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలు కొత్తవలస ప్రాంతానికి చెందిన జి.తులసిగా గుర్తించి అరెస్టు చేశారు.

నిపుణులు లేక సేవలు దూరం



వైద్యవిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా కేంద్రంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగంలో సివిల్ సర్జన్ పోస్టు ఖాళీ కావడంతో ఆ ప్రభావం రోగులపై పడింది. శస్త్రచికిత్సలు, సదరం ధ్రువపత్రాల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విభాగం వద్ద రోజూ 150 వరకు ఓపీ నమోదవుతోంది. వారానికి నాలుగు వరకు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంది. అయితే సివిల్ సర్జన్ శివప్రసాద్ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు. ప్రస్తుతానికి అసిస్టెంటు సివిల్ సర్జన్, నలుగురు జూనియర్ వైద్యులే నెట్టుకొస్తున్నారు.

కీలకమైనా.. గత ప్రభుత్వ హయాంలో కేంద్రాసుపత్రిని వైద్య కళాశాలలో విలీనం చేశారు. అందుకు తగ్గట్టుగా ఆచార్యుడు, సహాయ ఆచార్యుడు, ఇద్దరు అసిస్టెంట్లు ఉండాలి. ప్రస్తుతం ఒక అసిస్టెంటు ప్రొఫెసర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 15 ఏళ్ల కిందట ఈ ఆసుపత్రిలో ఇద్దరు సివిల్ సర్జన్లు ఉండేవారు. ఒకరు మొబైల్ యూనిట్, మరొకరు ఆసుపత్రి యూనిట్‌లో ఉండేవారు. అప్పట్లో సేవలు అంతంతమాత్రమే. వారిద్దరూ వెళ్లాక మరొకరు వచ్చినా ఉద్యోగ విరమణ పొందడంతో కంటి విభాగాన్ని చూసేవారే కరవయ్యారు. మరోవైపు కంటి అంధత్వ నివారణ సంస్థకూ అధికారి లేకపోవడం గమనార్హం. కొన్ని నెలలుగా ఉప డీఎంహెచ్‌వో ఎన్.సూర్యనారాయణ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నాయి. అయితే వైద్య శిబిరాలు, శస్త్రచికిత్సలు మాత్రం జరగడం లేదు. సేవలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని **ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు** తెలిపారు.

చిన్నారులకేం తెలుసు.. ప్రమాదం పొంచి ఉందని

మక్కువ మండలంలోని నంద అంగన్‌వాడీ కేంద్రం ప్రమాదస్థితిలో ఉంది. మట్టిగోడలతో నిర్మించిన పురాతన పెంకుటిళ్లు ఒకవైపు ఒరిగి ఉండటంతో కర్ర అడ్డు పెట్టి దన్నుగా ఉంచారు. ఇక్కడ సుమారు 14 మంది చిన్నారులకు ఆరుబయట గడపలో చదువులు చెబుతున్నారు. మౌలిక సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఏళ్లుగా అవస్థలు తప్పడం లేదు. కొత్త భవన నిర్మాణం మూడేళ్ల క్రితం ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేశారు. దీనిపై సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. – **న్యూస్‌టుడే, మక్కువ**



వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుక


కేకు కోస్తున్న కాయల సూరారెడ్డి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కేవీఆర్ గ్రూప్ ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. తన సహచరులతో కలిసి తిరుమలలో వెంకన్న స్వామిని దర్శించుకుని, అనంతరం కేకు కోశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. విశాఖ జిల్లా సీతమ్మధారలోని కేవీఆర్ ఎస్టేట్ కార్యాలయంలో ఆయన సోదరుడు కాయల సూరారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

29న పీఆర్టీయూ సదస్సు.. విజయనగరం అర్బన్: పీఆర్టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సును ఈనెల 29న విజయనగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్ తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BATH CLEANING

శ్రీ కనకదుర్గ హౌస్ కీపింగ్ సర్వీస్ మీ ఇంటి వద్దకు వచ్చి పరిశుభ్రంగా సకాలంలో చేయబడును. (టాయిలెట్, హాస్, సోఫాసెట్, డస్ట్, గ్లాస్, వాటర్ ట్యాంక్ Etc.) ✆ 8520804641, 9959138591.

REAL ESTATE

FLAT FOR SALE

2BHK 925 Sft. E/F 5 Yrs. Old Flat Sevasadhan Sainagar, Thotapalem, Near RTC Complex, Gayatri College, Sri chaitanya College. VZM 9933238460.

Flat for Sale: Sai Sravani Residency, Flat F2, 2nd Floor, Sunkaraveedhi, Vizianagaram. Area 900 S.Ft. Ph: 99087 33147.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 90008 66020

HOUSE FOR SALE

VZM టౌన్ తోటపాలెం RTC కాంప్లెక్స్ దగ్గర సాయినగర్ East Facingతో ఇల్లు అమ్మకానికి కలదు. 302 గజాలు D.No. 8.30-13/1 with full water ✆ 9494014654.

PLOT FOR SALE

BUDA Approved 167 Sq.Yards plots for sale Komatipalli - Bobbili TBR Engg College. Cost 6,80,000/-. Contact: 9492448528

VZM- VSP హైవే అయినాడ 5th బెటాలియన్ దగ్గర వెంటనే ఇంటిని కట్టుకునే VMRDA ప్లాట్లు అతితక్కువ ధరలో బ్యాంక్ లోన్‌తో కలవు. ✆ 9971116164.

Tagarapuvalasa Y Jn. Facing NH Bhoomatha Prashant Vihar 183, 180 Anandapuram @ Sontyam Bhoomatha Aroma Valley 167 Sq.Yd. Ph: 9866844433.

విజయనగరం-అరకు 100 Ft హైవేకు ఆనుకొని కొర్లాం గ్రామ పరిధిలో 6 లైన్స్ హైవే దగ్గరలో 355 చ.గ. లే-అవుట్ ప్లాట్ అమ్మబడును. ✆ 7730818466.

VZM టౌన్, రింగ్‌రోడ్, SVN నగర్ జ్ఞానసరస్వతి టెంపుల్ (Opp.) ఉడా అప్రూవ్డ్ లే అవుట్ (45x50), 250 Sq. Yds. West Facing అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీ ✆ 9849128770, 9059705269.

బొబ్బిలి-రామభద్రపురం హైవే ఆనుకొని 340 గజాల స్థలం అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీస్ ఓన్లీ ✆ 9996298999.

విశాఖ చుట్టు ప్రక్కల VMRDA అప్రూవుడ్ ఇళ్ల స్థలాలు స్పాట్ / వాయిదాలతో & బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. గరిమెళ్ళ పద్మావతి 9493640700, 9493640600.

JOBS

హైదరాబాద్ స్టార్ హోటల్స్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలో బాయ్స్ & గర్ల్స్ కావలెను. రూమ్, ఫుడ్ బస్ పాస్ ఫ్రీ. శాలరీ: 16000-25000. Ph: 9550110629, 8466882075

PAYTM Wanted FSEs, SKLM Dt., 12th pass, 21k Monthly + Incentive on roll Job, Sales Experience 1 Yr. Bike & Smart phone Ph: 6300795655.

KHK Group నందు పనిచేయుటకు సేల్స్ పర్సన్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్ కలదు. కోళ్ళ బజార్, విజయనగరం. Cont : 8977169444, 9888649444.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18k. ✆ 96405 28899, 96406 48899.

30 మందికి వంట చేయుటకు అనుభవం కలిగిన ఆడ వంట మనిషి ఉండిపోయేలా కావలెను. 12 వేలు జీతం, వసతి, భోజన సదుపాయం కలదు. కైలాసగిరి వైజాగ్ ✆ 7093485792.

ప్రైవేట్ బ్యాంకులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్, హౌస్‌కీపింగ్, గ్రౌండ్‌స్టాఫ్, టెక్నీషియన్స్, సిస్టం ఆపరేటర్స్, సివిల్ వర్కర్స్ కావలెను. Ph: 8520835183.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జానపద కళల ప్రదర్శనకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 13, 14వ తేదీల్లో లయన్స్ కమ్యూనిటీ భవనంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు జానపద కళల ప్రదర్శనలు ఉంటాయని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు బి.రామానందం తెలిపారు. పాల్గొనాలనుకునేవారు 2వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కళాకారులు స్థానికులై ఉండాలని, కళా ప్రదర్శన 15 నిమిషాలు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. వివరాలకు 89192 22064, 93475 22850 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నాటికలు, ఏకపాత్రాభినయాలు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 13, 14వ తేదీల్లో గురజాడ కళాభారతిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నాటికలు, ఏకపాత్రాభినయాల ప్రదర్శన ఉంటుందని జిల్లా ఆడిట్ అధికారిణి బి.అరుణ కుమారి తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 2వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని కోరారు. స్థానికులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 73968 32929, 95151 29843 నంబర్లను సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

బదిలీలు.. బాధ్యతలు


కలెక్టర్ అంబేడ్కర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అబ్కారీ అధికారి శ్రీనాథుడు

విజయనగరం అర్బన్, రింగురోడ్డు, న్యూస్‌టుడే: ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన పలువురు జిల్లా అధికారులు శుక్రవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా నుంచి వచ్చిన ఇ.నర్సింహారెడ్డి గనులు భూగర్భశాఖ అధికారిగా, అనకాపల్లిలో పనిచేసిన ఇ.సందీప్ డ్వామా పీడీగా, గుంటూరు జిల్లా నుంచి స్థానచలనం పొందిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జడ్పీ సీఈవోగా సత్యనారాయణ

విజయనగరం అర్బన్: జిల్లా పరిషత్తు సీఈవోగా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పరిపాలనాధికారిగా పనిచేస్తూ సీఈవోగా చేరారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛమందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ అంబేడ్కర్‌ను కలిశారు.

జలవనరుల ఈఈగా రమణ

అయ్యన్నపేట: జలవనరుల శాఖ ఈఈగా ఎంవీ.రమణ నియమితులయ్యారు. ఇంతవరకు ఆయన శ్రీకాకుళంలో విధులు నిర్వహించారు. ఇక్కడున్న ఎంఏ.సీతారామునాయుడు ఆమదాలవలస వెళ్లనున్నారు. ● లోతుగెడ్డ డీఈ ఎల్.గోవిందరావు విజయనగరం సబ్ డివిజన్ డీఈగా రానున్నారు. అక్కడి డీఈ బి.సంతోష్‌కుమార్ పార్వతీపురం డీఈగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ● టీటీపీఆర్(రాజాం) డీఈ ఎల్.నవీన్ లోతుగెడ్డకు నియమితులయ్యారు. ● విశాఖపట్నంలో డీఈగా చేస్తున్న శ్రీచరణ్ ఎస్.కోట సబ్ డివిజన్ డీఈగా వెళ్లనున్నారు. అక్కడున్న కె.రమణ విశాఖపట్నం బదిలీ అయ్యారు.

బీసీ సంక్షేమాధికారి బదిలీ

మయూరికూడలి: ఉమ్మడి జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్ కర్నూలు ఆర్డీవో వెళ్లనున్నారు. ఇక్కడ ఇంకెవరినీ నియమించలేదు.

రెవెన్యూ శాఖలో..

పార్వతీపురం: కేఆర్సీ ఉపకలెక్టరు (ఇన్‌ఛార్జి డీఆర్వో) జి.కేశవనాయుడు అనంతపురం ఆర్డీవోగా వెళ్లనున్నారు. ఆయన ఇక్కడ గృహనిర్మాణ సంస్థ పీడీగానూ ఉన్నారు. ఆయా స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. పలువురు తహసీల్దార్లను బదిలీ చేసి, బయట జిల్లాల నుంచి వచ్చిన కొందరికి స్థానాలు కేటాయిస్తూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 23 మంది ఉప తహసీల్దార్లు, 124 మంది వీఆర్వోలకు స్థానచలనం కల్పించారు.


జడ్పీ సీఈవోకు శుభాకాంక్షలు చెబుతున్న ఉమ్మడి జిల్లా అధికారులు, ఉద్యోగులు

దేవాదాయ శాఖ ఏసీగా శిరీష



కంటోన్మెంట్: దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా కె.శిరీష శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడున్న సుధారాణి అనకాపల్లి జిల్లాకు వెళ్లారు. శిరీష గతంలో రామతీర్థం కార్యనిర్వహణాధికారిణిగా, శ్రీకాకుళం జిల్లా సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు సత్తా

మునగపాక, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా మునగపాకలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో విశాఖ, తరువాతి స్థానాల్లో శ్రీకాకుళం, గుంటూరు జట్లు నిలిచాయి. విజేతలకు ఆర్ఈసీఎస్ మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాదు, ఆడారి కృష్ణ, టెక్కలి పరశురామ్, ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు.


ట్రోఫీతో జిల్లా క్రీడాకారిణులు, నిర్వాహకులు

(c) eenadu

బొబ్బిలి
●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి



'అన్న' క్యాంటీన్.. పేదల ఆకలి తీర్చెన్

వైకాపా ప్రభుత్వం అన్న క్యాంటీన్లపై కక్ష సాధింపు ధోరణి అవలంబించింది. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఎమ్మెల్యే బేబినాయన సొంత నిధులతో నిర్వహిస్తానని తెలిపినా.. భవనాన్ని ఇవ్వడానికి అధికారులు ఇష్టపడలేదు. మూతపడిన భవనం ప్రధాన గేటు వద్ద ఆరుబయట క్యాంటీన్ తెరిచారు. 815 రోజులు నిర్వహించి, రోజుకు 300 మంది పేదల ఆకలి తీర్చారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఈనెల 19న బొబ్బిలి పట్టణంలో ప్రారంభమైంది. వివిధ పనులపై పట్టణానికి వచ్చిన గ్రామీణులు, రోజు కూలీలు, విద్యార్థులు ప్రస్తుతం ఈ క్యాంటీన్‌లో భోజనం చేస్తున్నారు. తిరిగి ప్రారంభించటం తమలాంటి పేదలకు ఎంతో ఉపయుక్తమని పలువురు 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.



క్యాంటీన్ లోపల భోజనాలు చేస్తున్న ప్రజలు

ఆసుపత్రికి వచ్చా

బొబ్బిలికి ఆసుపత్రి పనిమీద వచ్చాను. బయట భోజనం చేయాలంటే రూ.100 అవుతుంది. అన్న క్యాంటీన్ తెరిచారని తెలిసి ఇక్కడకు వచ్చాను. రుచికరమైన వంటలతో చక్కని భోజనం పెట్టారు. ఎంతో తృప్తి అనిపించింది. – రమణ, కన్నంపేట, మక్కువ మండలం

అన్నీ బాగున్నాయ్

కూరలు, అన్నం, సాంబారు అన్నీ బాగున్నాయి. రుచికరంగా వేడి వేడి పదార్థాలు పెడుతున్నారు. బయట హోటల్‌లో కూడా అలాంటి భోజనం దొరకదు. పట్టణానికి వచ్చే పేదలకు భరోసాగా ఉంటోంది. – పార్వతి, సీతానగరం మండలం, బక్కుపేట

సౌకర్యాలు కల్పించాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్‌కు అన్ని సదుపాయాలు కల్పించాం. సుమారు రూ.5 లక్షలతో పాత భవనానికి మరమ్మతులు చేశాం. నాణ్యతలో రాజీపడకుండా ఆహారపదార్థాలను ఏజెన్సీ నిర్వాహకులు అందజేస్తున్నారు. – రామలక్ష్మి, పుర కమిషనర్

శిథిల కల్వర్టులు.. భయపెడుతున్నాయ్..!

న్యూస్‌టుడే, సంతకవిటి

ప్రధాన రహదారులపై ఉన్న శిథిల కల్వర్టులు ప్రయాణికులు, వాహన చోదకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇవి ఎప్పుడు కూలి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గత్యంతరంలేక ఈ కల్వర్టులపై నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఇది రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న 15 శిథిల కల్వర్టుల పరిస్థితి.



మల్లయ్యపేట వద్ద నారాయణపురం కుడి ప్రధాన కాలువపై ఇలా..

కూలేందుకు సిద్ధంగా..

సంతకవిటి మండలంలోని మల్లయ్యపేట - హొంజరాం, సంతకవిటి - చిత్తారపురం, పొందూరు, రాజాం, తాలాడ - మండవకురిటి ప్రధాన రహదారుల్లో ఏడు శిథిల కల్వర్టులున్నాయి. కొత్తవి నిర్మించాలని జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా.. పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● వంగరలోని అరసాడ, కొప్పరవలస, ఎమ్ఎస్ పురం, వంగర వద్ద ప్రధాన రహదారుల్లో కాలువలపై ప్రమాదకరంగా తయారయ్యాయి. ● రాజాంలోని అంతకాపల్లి, కంచరాం, బొద్దాం వద్ద ఉన్నవన్నీ కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ● రేగిడిలోని వన్నలి - ఉప్పరనాయుడువలస, కుమ్మర అగ్రహారం తదితర గ్రామాల వద్ద వాహన చోదకులను భయపెడుతున్నాయి



సాయన్న గెడ్డపై రామరాయపురం వద్ద దుస్థితి..

కొత్తవి నిర్మించేందుకు చర్యలు

రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి, వంగర, రేగిడి, రాజాం మండలాల్లో ప్రధాన రహదారుల్లో కాలువలపై శిథిల కల్వర్టులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. వీటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. – పి.సుధాకర్, ఈఈ, జలవనరుల శాఖ

ఆర్థిక సాయం విడుదల

తెర్లాం, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం ఆర్థికసాయం విడుదల చేసిందని తహసీల్దారు హేమంత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8 నుంచి 10 వరకు కురిసిన భారీ వర్షాలకు నందిగాం, తెర్లాంలో రెండు ఇళ్లు దెబ్బతిన్నాయని, ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? గుర్ల ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. - స్థానికులు

● నిధుల కోసం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - సాల్మన్‌రాజు, ఇంజినీరింగు అధికారి, గుర్ల

– న్యూస్‌టుడే, గుర్ల

సార్వత్రిక పాఠశాల వరం

రాజాం, న్యూస్‌టుడే: చదువును మధ్యలో ఆపేసిన వారికి సార్వత్రిక పాఠశాల వరమని రాష్ట్ర పరిశీలకుడు మురళీకృష్ణ పేర్కొన్నారు. పది, ఇంటర్‌ల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించారు. 28తో దరఖాస్తులకు గడువు ముగుస్తోందని, ఆ తరువాత అపరాధ రుసుంతో దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. హెచ్ఎం నాగయ్య, కోఆర్డినేటర్ రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఉద్యోగ మేళా



ప్రసంగిస్తున్న ప్రధానాచార్యుడు భాస్కరరావు

రాజాం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్తంగా శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. 226 మంది అభ్యర్థులు పాల్గొనగా 74 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్‌కుమార్, ఐటీఐ ప్రిన్సిపల్ బి.భాస్కరరావు తెలిపారు.

రోగుల సహాయకులకు అమృతహస్తం



భోజనాలు అందజేస్తున్న గద్దె బాబూరావు, నిర్వాహకులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో వైద్యానికి వచ్చే రోగుల సహాయకులకు ఆహారాన్ని అందించేందుకు కొంతమంది మానవతావాదులు నిర్వహిస్తోన్న 'శాశ్వత అమృత హస్తం' కార్యక్రమం ప్రారంభించి శుక్రవారంతో 300 రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు హాజరయ్యారు. రూ.10 వేలు విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. బీవీ గోవిందరాజులు, నారాయణరావు, వి.మోహనరావు, కృష్ణమూర్తి, జి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తెర్లాం, గజపతినగరం, రామభద్రపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలికల దినోత్సవం అక్టోబరు 11 పురస్కరించుకొని.. బాలికల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై మండల విద్యావనరుల కేంద్రంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 45 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఎంఈవోలు జె.త్రినాథరావు, ఆర్.పాపారావు చెప్పారు. ● గజపతినగరం మండలంలో నిర్వహించిన పోటీల్లో కె.జస్మిత (వక్తృత్వం), వ్యాసరచన సీనియర్ విభాగంలో ఐ.జయదీప్, జూనియర్ విభాగంలో కె.ఉత్తేజ, చిత్రలేఖనం సీనియర్ విభాగంలో ఎం.ప్రభుదాస్, జూనియర్ విభాగంలో జి.నివారిక విజేతలుగా నిలిచారు. 30న జరిగే జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఎస్.విమలమ్మ, సాయి చక్రధర్ తెలిపారు. ● నాయుడువలస పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి హెచ్ఎం జేసీ రాజు బహుమతులు అందజేశారు.

పోలింగు కేంద్రంలో కొట్లాటపై విచారణ



దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక ఉప కలెక్టరు మురళీకృష్ణ

గజపతినగరం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గజపతినగరం మండలం శ్రీరంగరాజపురంలోని పోలింగ్ కేంద్రం 100లో జరిగిన కొట్లాటకు సంబంధించిన ఫిర్యాదుపై కలెక్టరు ఆదేశాల మేరకు శుక్రవారం తోటపల్లి భూసేకరణ మూడో విభాగం ప్రత్యేక ఉప కలెక్టరు పి.మురళీకృష్ణ విచారణ చేపట్టారు. పీవోగా బాధ్యతలు నిర్వర్తించిన వి.రాంబాబుపై గ్రామానికి చెందిన ఇజ్జిరోతు చిన్నంనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నివేదికను కలెక్టరుకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉప తహసీల్దార్లు సతీష్, రమేష్ పాల్గొన్నారు.

ఇంకా తేలని వివాదం

బొబ్బిలి, న్యూస్‌టుడే: లక్ష్మీశ్రీనివాస జూట్‌మిల్లు స్థలం విషయమై ఇంకా వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. కార్మికులకు సంబంధించిన పీఎఫ్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో స్థలంలోకి వెళ్లనీయకుండా కొనుగోలుదారులు లక్ష్మీబజార్ ప్రమోటర్లను మొన్నటి వరకు అడ్డుకున్నారు. బకాయిలు చెల్లించేందుకు ఒప్పుకోవడంతో సమస్య కొలిక్కి వచ్చింది. శుక్రవారం స్థలాన్ని చదును చేసే క్రమంలో కొంతమంది వెళ్లి పనులు ఆపాలంటూ అడ్డుపడ్డారు. ఎస్సై రమేష్ చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ఘర్షణలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారుల వద్దకు ఇరువర్గాలు వెళ్లాలని సూచించారు.



స్థలం వద్ద ఇరువర్గాల వాదనలు వింటున్న పోలీసులు

విద్యతోనే వికాసం



మాట్లాడుతున్న రోటరీ జిల్లా కార్యదర్శి రవి

బొబ్బిలి, న్యూస్‌టుడే: విద్యతోనే వికాసం పెరుగుతుందని రోటరీ క్లబ్ జిల్లా కార్యదర్శి మండా రవి అన్నారు. శుక్రవారం ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో 'ప్రాథమిక విద్య-అక్షరాస్యత' అనే అంశంపై బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత అభివృద్ధికి విద్యే ఆధారమన్నారు. ప్రాథమిక విద్య రీజనల్ ఛైర్ జ్యోతి బచావత్ మాట్లాడుతూ బాలికా విద్య తప్పనిసరి అని తెలిపారు. రోటరీ జిల్లా ఛైర్ జేసీ రాజు, బొబ్బిలి యూనిట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, కమ్యూనిటీ ఛైర్ జి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

స్థలమూ పోయే.. నిలువనీడ లేదాయె



తరగతులు నిర్వహిస్తున్న వసతి గృహం

న్యూస్‌టుడే, రాజాం

దశాబ్దాల పాటు వెలుగు వెలిగిన విద్యాలయం అది. సువిశాల ప్రాంగణం, ఆహ్లాదకర వాతావరణం దీని సొంతం. ఎక్కడెక్కడ నుంచో బాలికలు వచ్చి ఇక్కడ చదువుకునే వారు. వందల మందితో నిత్యం కళకళలాడేది. ఇంతటి చరిత్ర ఉన్న రాజాం పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాల ఇప్పుడు నిలువు నీడ లేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలకు చెందిన విలువైన స్థలం ఇతర విద్యాసంస్థలు, వసతి గృహాలకు కేటాయించారు. మిగిలిన స్థలంలోనైనా.. పాఠశాల భవనాలు నిర్మించండి మహాప్రభో అంటూ మొత్తుకుంటున్నా వినే నాథుడే కరవయ్యాడు.

తగ్గిన ప్రవేశాలు..

ఒకప్పుడు ఈ పాఠశాలలో 800 మంది వరకూ బాలికలు చదువుకునే వారు. ఏళ్లుగా సేవలందించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చేశారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మించ లేదు. విద్యార్థులకు ఎస్టీ సంక్షేమ బాలికల వసతి గృహంలోని కొంత భాగంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో ప్రవేశాలు తగ్గాయి. ప్రస్తుతం 6 నుంచి పదో తరగతి వరకు 192 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇప్పుడు వసతి చాలడం లేదనే నెపంతో భవనాలు ఖాళీ చేయాలని వసతి గృహం నిర్వాహకులు హుకుం జారీ చేశారు. ఇప్పుడు ఎక్కడికి వెళ్లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

పాఠశాల 2.39 ఎకరాల సువిశాల స్థలంలో సారథి రెవెన్యూ పరిధిలో రాజాం నడిబొడ్డులో ఉంది. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్టీ సంక్షేమ బాలికల వసతి గృహం, కేజీబీవీ టైప్-4 వసతి భవనాలకు ఈ స్థలం కేటాయించారు. దాంతో బాలికోన్నత పాఠశాలకు స్థలం తగ్గిపోయింది.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం

భవనాలు మంజూరు చేయాలని కాళ్లరిగేలా తిరుగుతున్నాం. ఎస్టీ బాలికల సంక్షేమ వసతి గృహంలో ఆరు గదులు ఇచ్చారు. ఇప్పుడు ఖాళీ చేసేయమంటున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. – బొంతు మాధురి, హెచ్ఎం, సారథి జడ్పీ బాలికోన్నత పాఠశాల



పాఠశాలకు చెందిన స్థలంలో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



ఏవోను వివరాలు అడుగుతున్న జడ్పీ ఛైర్మన్

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో శాశ్వత వైద్యులు లేక పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారని, చాలా కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్‌కార్డు లేకపోవడంతో పనులకు వెళ్లలేకపోతున్నారని సర్పంచి రమేష్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. ఎంపీపీ బి.గౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రైతులకు ఎరువులు ఎంతవరకు అందుతున్నాయి, ఈ క్రాప్ నమోదు ఎంతవరకు వచ్చిందంటూ జడ్పీ ఛైర్మన్ ఏవో శిరీషను ప్రశ్నించారు. వాకాడ గ్రామానికి వ్యవసాయ సహాయకులు లేరని గ్రామ సర్పంచి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన 1,445 గృహాల్లో ఇంకా 167 అసంపూర్తిగా ఉన్నాయని గృహనిర్మాణ సంస్థ డీఈ పి.అప్పయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు భాస్కరరావు, జడ్పీటీసీ సభ్యుడు రామారావు, మండల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధ్యతల స్వీకరణ

తెర్లాం: మండల ఇంజినీరింగ్ అధికారిగా వి.సత్యంనాయుడు నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం డివిజన్‌లో నాణ్యత విభాగంలో ఏఈగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. తెర్లాం మండల ఇంజినీరింగ్ అధికారిగా పనిచేసిన రాజశేఖర్ బొబ్బిలి మండలానికి బదిలీపై వెళ్లారు.

జీతాలు ఇప్పించండి

బాడంగి: గ్రామాలను శుభ్రం చేసే వారి జీవితాలు దుర్భరంగా ఉన్నాయని, 16 నెలలు జీతాలు రాక హరిత రాయబారులు ఇబ్బందులు పడుతున్నారని సిటు నాయకులు.. జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు తెలిపారు. సురేష్ ఆధ్వర్యంలో ఛైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

గద్దె బాబూరావుకు అభినందనలు

చీపురుపల్లి గ్రామీణం, చీపురపల్లి: రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ పాలకవర్గ సభ్యునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావుకు అలజంగి ఎంపీటీసీ సభ్యుడు ఎస్.శ్రీనివాసరావు.. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల రేషన్ డీలర్లు అభినందనలు తెలిపారు. డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే బదిలీలు

బొబ్బిలి: విద్యుత్తు శాఖలో నిబంధనల మేరకు బదిలీలు జరిగాయని తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తేజేశ్వరరావు, కె.జయరాజు వెల్లడించారు. శుక్రవారం జరిగిన బొబ్బిలి యూనిట్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. బదిలీలపై కొన్ని సంఘాలు లేనిపోని తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

బొబ్బిలి గ్రామీణం: వైకాపా హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి ప్రభుత్వం 'మన ఇళ్లు- మన గౌరవం' కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం ఎం.బూర్జివలస, నారాయణప్పవలస, పెంట, రంగరాయపురం, పిరిడి తదితర గ్రామాల్లో ప్రత్యేకాధికారులు లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రాంగణ ఎంపికల్లో సత్తా

రాజాం: ప్రాంగణ ఎంపికల్లో జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 40 మంది ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డా.ఎం.పురుషోత్తమరావు తెలిపారు. కళాశాలలో ఈనెల 23న ఎంఎస్ స్క్వేర్ టెక్నాలజీ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు చెప్పారు. శుక్రవారం ఫలితాలు వెల్లడించిందన్నారు.

తెదేపా సభ్యత్వ నమోదు

చీపురుపల్లి: తెదేపా సభ్యత్వ నమోదు అక్టోబరు 1 నుంచి జరగనుందని, నాయకులు, కార్యకర్తలు కలిసి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు శ్రేణులకు పిలుపునిచ్చారు. చీపురుపల్లి సమావేశంలో ఆయన మాట్లాడారు.

డీఎంహెచ్‌వో సందర్శన

గుర్ల: పెనుబర్తి గ్రామంలో పలువురికి డయేరియా సోకడంతో శుక్రవారం డీఎంహెచ్‌వో భాస్కరరావు గ్రామాన్ని సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ఇసుక లారీని అడ్డుకున్న కొమెర వాసులు



వాహనం ముందు గ్రామస్థులు

రేగిడి, న్యూస్‌టుడే: నాగావళి నదిలో కేవీపురం రేవునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని శుక్రవారం కొమెర గ్రామస్థులు అడ్డుకున్నారు. లారీకి అడ్డంగా నిల్చొని కదలకుండా నిలిపివేశారు. తమ గ్రామం మీదుగా ఇసుకను తరలిస్తే అనుమతించబోమని, వంతెన బలహీనంగా ఉండటంతో పాటు రోడ్లు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దుల మృతి



బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తపెంటలో విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి చెందాయి. రైతు తిరుపతిరావు వివరాల ప్రకారం.. శుక్రవారం వేగావతి నదికి ఇసుక కోసం ఎడ్ల బండి తీసుకెళుతుండగా.. సాగునీటి కాలువలో తెగిపడిన విద్యుత్తు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాయి. రైతుకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. విద్యుత్తు శాఖ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. గాలుల కారణంగా తీగలు తెగిపడి ఉంటాయని ఏడీఈ శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు చెప్పారు.

మత్తుతో జీవితాలు చిత్తు

గుర్ల, రేగిడి, చీపురుపల్లి, రామభద్రపురం, మెరకముడిదాం, న్యూస్‌టుడే: మత్తు జీవితాలను చిత్తు చేస్తుందని, దాని ఊబిలో పడిన వారు సర్వం కోల్పోతారని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. శుక్రవారం గుర్ల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో సంకల్పం అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేశారు. సీఐ శంకరరావు, ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు. ● చెడు పనుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రేగిడి ఎస్సై నీలావతి అన్నారు. లక్ష్మీపురంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించి గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ● యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చీపురుపల్లి సీఐ శంకరరావు అన్నారు. చీపురుపల్లిలోని నాలుగు రహదారుల కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ● యువత మంచి ప్రవర్తనతో మెలగాలని సీఐ నారాయణరావు తెలిపారు. కొట్టక్కిలో పోలీసు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ● విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బుదరాయవలస ఎస్సై లోకేశ్వరరావు సూచించారు. సోమలింగాపురం జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.



ఫిర్యాదుల బాక్సు చూపిస్తున్న డీఎస్పీ, సీఐ తదితరులు

పారాలీగల్ వాలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం, న్యూస్‌టుడే: పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్ సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు స్థానిక కోర్టు సముదాయంలోని మండల న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పారాలీగల్ వాలంటీర్లకు జీతభత్యాలు, పారితోషికాలు, వేతనాలు చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు అక్టోబరు 8లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.


జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాజాం, గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: డోలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అండర్-14, 17 పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీకి ఎస్.పవన్, రాజేష్, కుమార్, ఎం.శృతి, టి.లత, అశోక్, కిరణ్, నరేశ్, మహేష్ ఎంపికైనట్లు పీడీ రేణుక తెలిపారు. బ్యాడ్మింటన్‌కు జి.శిరీష, చదరంగం పోటీలకు జి.రవిచంద్ర, కె.పల్లవి, షాట్‌పుట్‌కు శివశంకర్ వరప్రసాద్, కె.హాసిని ఎంపికయ్యారు. ● పెదవేమలి జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 ఖోఖో, వాలీబాల్, యోగా తదితర పోటీల్లో 380 మంది పాల్గొనగా 48 మంది జిల్లాస్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారిణి విజయకుమారి తెలిపారు.



విద్యార్థులతో హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు











(c) eenadu

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం - 80089 02900
విజయనగరం గ్రామీణం - 80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం - 80085 74319

❖ పట్టణంలోని గాంధీనగర్‌లో 1,2,3,4,5 వీధు లకు 15రోజులుగా కుళాయిల నుంచి నీరు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- కృష్ణారావు, గాంధీనగర్, శృంగవరపుకోట.**

❖ ప్రధాన పైపులైన్లు మరమ్మతులు చేసేలా సిబ్బందికి ఆదేశించాం. మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. **-సత్యకిశోర్, జేఈ, రక్షిత మంచినీటి సరఫరా విభాగం, ఎస్.కోట.**

❖ పట్టణంలో మునసబువీధి 5వ వీధిలో రహా దారి, కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. **-ధనుంజయ్, మునసబువీధి**

❖ పంచాయతీ సమావేశంలో చర్చించి రోడ్డు, కాలువ నిర్మాణానికి చర్యలు చేపడతాం. **-అనూరాధ, ఈవో, శృంగవరపుకోట.**

❖ పోలిపల్లి జాతీయ రహదారి నుంచి గ్రామం వరకూ రహదారి గుంతలమయమైంది. **- రాజారావు, స్థానికుడు**

❖ ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.త్వరలో పరిష్కరిస్తాం. **- రవికుమార్, ర.భ. ఏఈ - న్యూస్‌టుడే, భోగాపురం**

❖ ప్రశాంతినగర్‌లో కుక్కలు ఎక్కువగా సంచ రిస్తున్నాయి. **- స్థానికులు**

❖ కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. అక్కడ చేయిస్తాం. **- సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి**

❖ పీఎస్‌ఆర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- స్థానికులు**

❖ పరిశీలించి, బాగుచేయిస్తాం. **- ఎస్.అప్పారావు, డీఈఈ, నగర పాలక సంస్థ - న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం**

పుస్తకం ఆవిష్కరణ

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: తిరుమల తిరు పతి దేవస్థానం- హిందూ ధర్మప్రచార పరిషత్తు ఉమ్మడి జిల్లాల శాఖ ఆధ్వర్యంలో 'మానవులం దరికీ భగవద్గీత' పుస్తకాన్ని తితిదే ప్రోగ్రామ్ అసిస్టెంట్ జె.శ్యామసుందరం విజయనగరం లోని తితిదే కార్యాలయంలో ఆవిష్కరించారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



నెల్లిమర్ల: రామతీర్థం ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యా హవచనం, అంకురారోహణం చేపట్టారు. ఈవో శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ



పరిశీలిస్తున్న కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్


నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్లలో ఉన్న ఈవీఎం గోదాము ను కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. గదులకు వేసిన సీళ్లను తెరిపించి పరిశీలించారు. ఎన్నికల్లో వినియోగించిన రిజర్వులో ఉంచిన ఈవీఎంలను తరలించే దుకు ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాయాలని ఆర్డీవో సూర్యక కు ఆదేశించారు. ఆయన వెంట డీఆర్వో అనిత, ఈవీఎంల ఇన్‌ఛార్జి బి.ఉమాశంకర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, తహసీల్దార్ బి.సుదర్శనరావు ఉన్నారు.

అథ్లెట్ల పతకాల వేట

❖ చదువు, క్రీడల్లో రాణిస్తున్న అమ్మాయిలు

❖ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా

దూసుకుపోతోంది..



గుర్ల మండలం పాలవలసకు చెందిన పి.హేమ హైజంప్‌లో అథ్లెట్‌గా దూసుకెళ్తోంది. వ్య వసాయదారులైన పి.రామలక్ష్మి, శ్రీనివాస్ దంపతుల కుమార్తె. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇప్పటివరకు 8 సార్లు రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహించింది. గతేడాది నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్‌గేమ్స్‌లో స్వర్ణం గెల్చుకుంది. మహారాష్ట్రలో నిర్వహించిన టోర్నమెంట్‌లో జిల్లా తరఫున పాల్గొంది. జిల్లా కేంద్రంలో ఉంటూ స్కూల్‌గేమ్స్‌పై దృష్టిసారించింది.

మూడుసార్లు సత్తా..



పూసపాటిరేగ మండలం మర్రిపేటకు చెందిన కె.లక్ష్మి ఇక్కడే ఇంటర్ చదువు తోంది. మూడుసార్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొంది. 2022లో ఏలూరు, శ్రీకాకుళం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్- 14 విభాగంలో జిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహించింది. తిరుపతిలో సీఎం కప్ 2023-24లో 4400 రిలేలో కాంస్యం సాధించింది.

అడుగు పెడితే పతకమే..



నగరానికి చెందిన ఎస్.అయ్యప్ప స్వామి, దేవి దంపతుల కుమార్తె శ్రావణి. 2020లో అథ్లెటిక్ మైదానంలో అడుగుపెట్టిన ఈమె 2021 గుంటూ రులో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నీలో నాలుగో స్థానంలో నిలిచింది. 2022లో కర్నూల్ స్టేట్ మీట్‌లో 60 మీటర్లు, 200 మీటర్ల పరుగులో రజతం దక్కించుకుంది. కేరళలోని పీటీ ఉష స్కూల్‌కు ఎంపికైంది. 2023-24లో కేరళ నిర్వహించిన మీట్‌లో ఆ రాష్ట్రం తరఫున ఆడి 4*400 రిలేలో స్వర్ణం కైవసం చేసు కుంది. ప్రస్తుతం నగరంలో ఇంటర్ చదువుతోంది.

హైజంప్‌లో మెరిసింది..



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న జి. లక్ష్మి హైజంప్‌లో రాణిస్తోంది. తల్లిదండ్రులు చిన్నోడు, సింహాద్రి. తండ్రి భవన నిర్మాణ పనులు చేస్తుంటారు. పూస పాటిరేగ మండలం మర్రిపేట గ్రామానికి చెందిన ఈ విద్యా ర్థిని జిల్లా కేంద్రంలోని బీసీ వసతి గృహంలో ఉంటూనే పోటీల కోసం విజ్జీ మైదానంలో సాధన చేస్తోంది. రాష్ట్రస్థాయి టోర్నీల్లో నాలు గుసార్లు పాల్గొంది. 2023-24లో తిరుపతిలో నిర్వహించిన సీఎం కప్ మీట్‌లో కాంస్యం గెల్చు కుంది. శ్రీకాకుళంలో 2022-23 అండర్- 14 స్కూల్‌గేమ్స్‌లో హైజంప్‌లో కాంస్యంతో మెరిసింది.

పుట్టిన ఊరుకు దూరంగా ఉంటు న్నారు. వారి కలలను నిజం చేసు కోవడమే కాకుండా, తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని నింపేందుకు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు వసతి గృహ విద్యార్థినులు. రోజూ సాధన చేస్తూ పట్టు సాధిస్తున్నారు. త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్‌కు సిద్ధమవుతున్నారు.

- న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

క్రీడల్లో బంగారం..



పైడి వసంత విజయనగరంలోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తల్లిదం డ్రులు పి.అప్పలకొండ, రాంబాబు వ్యవసా యదారులు. రాష్ట్రస్థాయిలో పతిసార్లు, జాతీయస్థాయిలో ఒకసారి ఆడింది. శ్రీకా కుళంలో జరిగిన స్కూల్‌గేమ్స్-19లో 100, 200 పరుగులో స్వర్ణం గెల్చుకుని అదే ఏడాది మధ్యప్రదేశ్ టోర్నమెంట్‌కు జిల్లా నుంచి హాజరైంది. 2023 గుంటూరు సౌత్ జోన్ రిలేలో రజతం, 2022లో శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం కైవసం చేసుకుంది. ఈ విద్యార్థిని స్వగ్రామం పూసపాటిరేగ మండలం కొల్లాయవలస.

సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, నాయకులు

డెంకాడ, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: డెంకాడ మండలం పెద తాడివాడ గ్రామంలో సిరి మాను చెట్టు ను గుర్తించారు. పైడి తల్లి అమ్మవారి సిరిమాను చెట్టుకు పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సిరిమానును శనివారం ఉదయం బూదేవి నుంచి వేరుచేసి ఊరేగింపుగా విజయనగరంలోని పైడితల్లి ఆలయానికి తరలించనున్నారు. ఈ మేరకు సుమారు 12 వేల మందికి అన్న సమారాధనకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు దంప తులు దర్శించుకుని, పూజలు చేశారు. అంతకుముందు ఆయన రామతీర్థం ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. నాయ కులు సువ్వాడ రవిశేఖర్, ఆనందకుమార్, రాజారావు, అప్పలనా యుడు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

నెల్లిమర్ల: తెదేపా బలోపేతానికి మరింత కృషి చేస్తామని మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. శుక్రవారం జరజాపుపేట 19వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వైకా పాకు చెందిన వార్డు మాజీ సభ్యుడు దాసరి త్రినాథ్‌తో పాటు 30 కుటుంబాలు కాళ్ల సత్యవతి ఆధ్వర్యంలో బంగార్రాజు సమక్షంలో చేరికయ్యారు. తెదేపా కండువా వేసి ఆహ్వానించారు.

టీచర్స్ కాలనీలో కాలువలు లేక అవస్థలు

పట్టణంలోని టీచర్సు కాలనీలో మురుగునీటి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో ఇళ్ల నుంచి వాడుక నీరు రోడ్డుపైనే పారుతుండటంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. కాలనీలో దాదాపు అన్ని వీధులకు సీసీ రోడ్లున్నా కాలువలు నిర్మించలేదు. దీంతో చిన్నపాటి వర్షం పడినా రోడ్డుపైన, ఇళ్ల చుట్టూ నీరు చేరుతోంది. దోమలకు నిలయమై రోగాలకు కారణమవుతోందని స్థానికులు వాపోతు న్నారు. కొన్ని వీధులకు నడిచి వెళ్లేందుకు వీలు కావడం లేదని, అధికారులకు తెలిపినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో కుళాయిలకు నీరు రావడం లేదన్నారు. దీనిపై పంచాయతీ ఈవో అనురాధ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తా వించగా సర్వేచి, కార్యాచరణతో చర్చించి సమస్యలు పరిష్కరి స్తామన్నారు. **- న్యూస్‌టుడే, శృంగవరపుకోట**



కాలువలు లేక రోడ్డుపై వస్తున్న వాడుక నీరు

మరుభూమి బాగుకు చర్యలు



సర్పంచి రామస్వామికి వినతి పత్రం ఇస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఈనాడు కథనానికి స్పందన

కొత్తవలస, న్యూస్‌టుడే: కనీస సదుపా యాలు లేని పట్టణంలోని మరుభూమిని బాగు చేయడానికి చర్యలు ప్రారంభమ య్యాయి. ఈ శ్మశానవాటిక పరిస్థితిపై 'మరుభూమి ఏదిసిస్తోంది' శీర్షికతో శుక్ర వారం 'ఈనాడు'లో వచ్చిన కథనం ఇటు పంచాయతీ, పట్ట ణవాసులను కదిలించింది. సర్పంచి ఎం.ఎర్రయ్య రామ స్వామి సిబ్బందితో కలిసి శుక్రవారం వెళ్లి పరిశీలించారు. నేటి నుంచి పనులు బాగుచేయించారు. తుప్పలు తొలగించాలని పారిశు ధ్య సిబ్బందిని ఆదేశించారు. మరుగుదొడ్ల సముదాయం వాటర్ ట్యాంకు నుంచి ప్రత్యేకంగా పైపులైను వేసి నీరు తీసు కొస్తామని, రోడ్డు నిర్మిస్తామని సర్పంచి ప్రకటించారు. మరు భూమిని మెరుగుపర్చాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘం నాయ కులు సర్పంచిని కలిసి వినతి పత్రం ఇచ్చారు.

ఒరిగిన స్తంభం.. పొంచిఉన్న ముప్పు



విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో విద్యుత్తు వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడే స్తంభాలు ఒరిగిపో యాయి. చాలాప్రాం తాల్లో ఇంకా ఏళ్ల నాటి ఇనుప స్తంభాలే దర్శనమి స్తున్నాయి. స్థానిక గాజులరేగ బీటీఆర్ కాలనీ ఎన్టీఆర్ విగ్రహం దారిలో ఉన్న స్తంభం ప్రమాదక రంగా ఓ వైపు ఒరిగిపోయింది. ఇది రద్దీ ప్రాంతం కావడం, నిత్యం వందలది వాహనాలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంతా భయాందోళన చెందుతున్నారు. పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసు కుంటామని ఈఈ పి.త్రినాథరావు తెలిపారు.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

సమస్యలు పరిష్కరించాలని డిమాండు

విజయనగరం అయ్యన్నపేట/మయూరికూడలి, న్యూస్‌టుడే: క్లాప్ వాహనాల చోదకులతో వెట్టిచాకిరీ చేయించుకుం టున్నా.. వారి సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏపీ స్వచ్ఛాంధ్ర క్లాప్ వాహనాల చోదకుల యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వ ర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి గంటస్తంభం వరకు భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎఫ్ నగదు జమచేయాలని, ఈఎస్ఐ కార్డులు ఇప్పించాలని అధికారులను అడిగితే తమకు సంబంధం లేదని చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు.



భిక్షాటన చేస్తున్న క్లాప్ వాహనాల చోదకులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పెట్టెను ఏర్పాటు చేస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌కుమార్

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసైతే ఉన్నతమైన భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందని గ్రామీణ సర్కిల్ సీఐ శ్రీనివాసమూర్తి సూచించారు. శుక్ర వారం నగరంలోని బీసీ కాలనీలో ఉన్న ఐటీఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి కొనడం, అమ్మడం, తాగడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ముందుకు రావాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో సంకల్పం బాక్సును ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ఎస్ఐ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సర్వసభ్య సమావేశం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ మామిడి అప్ప లనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో చర్చించారు. ఎంపీడీవో చంద్రకళ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు



విజయనగరం పట్టణం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయు క్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ 'సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శుక్రవారం తన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు.

సమస్యల పరిష్కారానికి 30న ధర్నా

విజయనగరం అయ్యన్నపేట/మయూరికూడలి, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలు, పురపాలికలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వ హించనున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు జగన్మోహన్‌రావు తెలిపారు.

పోడు పట్టాల మంజూరుకు వినతి

ఎస్.కోట: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పోడు పట్టాలు మంజూరు చేయాలని కిల్తంపాలెం పంచాయతీకి చెందిన గిరిజనులు శుక్రవారం తెదేపా నాయకుడు సాయిరాం ఆధ్వర్యంలో తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందిం చారు. చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

ప్రశాంతంగా తైక్వాండో ఎంపికలు



విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ అండర్- 19 జిల్లా స్థాయి తైక్వాండో జట్టు ఎంపి కలు శుక్రవారం రాజీవ్ మైదానంలో జరిగాయి. 30 మంది బాల, బాలికలు పాల్గొనగా.. ఆరుగురు బాలురు, 8 మంది బాలికలు ఎంపికయ్యారు. వచ్చేనెల 4, 5వ తేదీల్లో రైల్వే కోడూరులో రాష్ట్రస్థాయి పోటీలు జరు గుతాయని కార్యదర్శి పీఈవీఎల్ఎన్.కృష్ణ తెలిపారు.

ముగ్గురు జూనియర్ సహాయకులకు బదిలీ

ఎస్.కోట: పంచాయతీలో పనిచేస్తున్న జూనియర్ సహా యకులు ఎస్.శ్రీనివాసరావు, వి.కృష్ణలకు కొత్తవలసకు, వి. ప్రసాద్‌కు జామి పంచాయతీకి బదిలీ అయ్యింది. వీరి స్థానంలో జామి, కొత్తవలస, భోగాపురం నుంచి ఆర్.భారతి, ఎన్ఎస్ఎన్ పట్నాయక్, ఎం.సురేష్ నియమితులయ్యారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

జామి, న్యూస్‌టుడే: జామి గోస్తనీ నది నుంచి అక్ర మంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును గ్రామంలోని రోకలి వీధి చివర్లో ఎస్ఐ వీరజనార్దన్ సిబ్బందితో వెళ్లి పట్టుకు న్నారు. జామికి చెందిన కృష్ణదిగా గుర్తించారు. ట్రాక్టరును సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువోత్సాహం..: భోగాపురం: విద్యార్థుల సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ జి. జయసుమ అన్నారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరి గిన స్వాగతోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డారు. ఆనం తరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ప్రాణాలు తోడేస్తోంది

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని వావిలపాడు నుంచి ఆనంద పురం- దేవరపల్లి వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కేవలం నాలుగు నెల్లలో ఈ మార్గంలో నాలుగు ప్రమా దాలు చోటు చేసుకోగా, ఇద్దరికి కాళ్లు విరగగా, మరొకరు బీల గంగు నాయుడు మృతి చెందారు. నాలుగోసారి రాతి క్వారీ లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి పంట పొలాల్లో బోల్తా కొట్టింది. వావిలపాడు, వీలుపర్తి రెవెన్యూల్లోని రాతి క్వారీల నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు ఇరుకుగా ఉండడం, మలుపులు అధికంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వేపాడ నుంచి వావిలపాడు మీదుగా కొత్తవలస - దేవ రాపల్లి రోడ్డు వరకు సుమారు 9 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు గతంలో హామీలిచ్చిన నిధులు మంజూరయ్యాయి. సంబంధిత గుత్తే దారు చామలాదేవి అగ్రహారం వరకు సుమారు 6 కి.మీ. మేర పని చేపట్టారు. ఏడాదిలో రూ. లక్షల విలువైన రాయి రవాణా అయినా, పనులు ద్వారానా బాగుపడలేదని వాపోతున్నారు.

నిధులు పెండింగులో ఉన్నాయి..: రూరల్ విస్తరించాలని ఆర్.భ.శాఖ అధికారులకు పలు మార్లు విన్నవించినట్లు సర్పంచి బీల రాజేశ్వరి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. నిర్మాణాలకు ప్రతిపాద నలు పంపించామని, నిధులు రాగానే పనులు చేస్తామన్నారు.



వావిలపాడు సచివాలయం సమీపంలో ప్రమాదకరమైన మలుపు

నగరాభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి



అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనరు, అధికారులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: అన్ని విభాగాల సమన్వయంతో నగరాభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని విశాఖ రీజి యన్ పురపాలక పరిపాలన శాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.రవీంద్ర ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనులపై చర్చించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ వసూళ్లను గణనీయంగా పెంచాలన్నారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ నల్లనయ్య, సహాయ కమిషనర్ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కలిశెట్టి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం అమరావ తిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలి శారు. ఐదేళ్లుగా వర్షాల కారణంగా ఏర్ప డిన నష్టాలను వివరించారు.



విద్యార్థుల దాతృత్వం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న డీఈవో, యాజమాన్యం

విజయనగరం విద్యావిభాగం, కొత్తవలస, న్యూస్‌టుడే: వరద బాధితులకు బాసటగా నిలుస్తూ పాఠశాల విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుతున్నారు. కొత్తవలస మండలం కంటకాపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూ.16,365, చీపురు పల్లి లిటిల్ ఏంజెల్ పాఠశాల బాలలు రూ.60 వేలు అంద జేశారు. సంబంధిత చెక్కులను కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు. డీఈవో ఎన్.ప్రేమకుమార్, ప్రధానోపాధ్యాయుడు వి.అరుణ్‌కుమార్, స్కౌట్ అండ్ గైడ్స్ బి.నరసింహనాయుడు, సి.హెచ్.అమరావతి, బి.కల్పన, ఎం.పుష్పలత పాల్గొన్నారు.

రూ.8,200 విరాళం అందజేత

ఎస్.కోట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయనగరం జిల్లా నుంచి రూ.8,200 నగదు విరా ళాలు సేకరించామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డి సూర్యారావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడికి అందజేశామన్నారు. రమణా రావు, తాతారావు ఆధ్వర్యంలో సేకరించారు.

నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనరుగా అప్పలరాజు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నగర పంచాయతీకి నూతన కమిషనరుగా కిల్లాన అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపా లిటీ ప్రజారోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఆయన కమి షనరుగా బదిలీపై నెల్లిమర్ల వచ్చారు. ఇక్కడి ఇన్‌ఛార్జి కమిషనరుగా విధులు నిర్వహిస్తున్న విశ్వేశ్వరరావు అనకా పల్లి జిల్లా ఎలమంచిలి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా, ఆర్వో పాపయ్యరాజు సొలారు పురపాలక సంఘానికి వెళ్లారు.

స్వాగత వేడుక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: నగ రంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే(స్వాగత వేడుక) వేడుకలను సీనియర్ విద్యా ర్థులు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతి థిగా హాజరైన జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎం.కృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు తమ నృత్యాలతో అలరించారు.



రామాయణం.. ప్రశాంత జీవన మార్గం



వేదపండితుడిని సత్కరిస్తున్న నారాయణం ట్రస్టు నిర్వాహకులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ప్రశాం తమైన జీవితాన్ని గడపడానికి రామా యణం ఎంతో ఉప యోగపడుతుందని తెలంగాణ రాష్ట్ర వేద విద్యా పండి తుడు అప్పల శ్యామ్‌ప్రణీత్‌శర్మ అవధాని అన్నారు. రామనా రాయణం ప్రాంగణంలో వాల్మీకి రామాయణ పఠనోత్సవ కేంద్రం ప్రారంభ సందర్భంగా జరుగుతున్న వేద సదస్సులో ఆయన మాట్లాడారు. నిరాడంబరత, నైతికత, స్వచ్ఛతతో జీవించడానికి ఈ ఇతిహాసం దోహదపడుతుందన్నారు. ప్రవచన ప్రవీణ సోమయాజుల గోపాలరావు, రామాయణ పారకులు అంతర్వేది కృష్ణమాచార్య, జాఫ్నవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎల్.కోట, న్యూస్‌టుడే: గిరిజనులు ఎదు ర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని ఎమ్మెల్యే లలితకుమారి పేర్కొ న్నారు. శుక్రవారం రేగ్యాట్టుగిరికి చెందిన గిరిజనులు ఆమెను కలిసి వినతులిచ్చారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు అందించడానికి తహసీల్దారుతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. ఇళ్ల బిల్లులు, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు తెస్తామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

రామతీర్థం దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ రామ తీర్థం దేవస్థా నాన్ని మరింత అభివృద్ధి చేస్తా మని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. శుక్రవారం రామతీర్థంలో సింగపూర్ వాస్తవ్యులు పోగురు రామచంద్ర రావు, మంజుల దంపతులతో, ప్రముఖ సినీ సంగీత దర్శ కుడు మాధవపెద్ది సురేష్, పాఠశాలల విద్యార్థులు పవన్, నిత్య సంతోషిని గానం చేసిన శ్రీరామచిద్ర రము పుంగవ సుప్రభాతం ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామికి సుప్రభాత సేవ ఆడియో రూపొందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ సరో జిని పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు శ్రీకారం

జామి: అన్నమరాజుపేటలో కనక దుర్గమ్మ ఆలయం వద్ద దేవీ నవరాత్రి నిర్వహణకు శుక్రవారం పందిరిరాట నిర్వహించారు. మాజీ సర్పంచి మంగమ్మ, తెదేపా నాయకుడు అప్ప లరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

CHANGE OF NAME
I am MIRTIPATI VENKATA RATNAMU, W/o MIRTIPATI PARVATE ESWARA RAO, Resident of Flat No.118, Akshaya Nidhi Heights, Dasannapeta Ring Road, Near Apollo Pharmacy, Vizianagaram - 535002, Andhra pradesh, have changed my name from NALI VENKATARATNAMU to MIRTIPATI VENKATA RATNAMU. Henceforth I will be known as MIRTIPATI VENKATA RATNAMU for All purposes.

శ్రద్ధాంజలి



భార్య: సిరిశెట్టి రామాదేవి
కుమారులు: S. రాజకుమార్, M. అంజనేయులు, Y. సురేష్
కుమార్తెలు: మాధురి, శిరీష, ప్రశాంతి
Retd. Magistrate